


మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA






ప్రత్యేక రాయితీలతో ఆకట్టుకుంటున్న షాపింగ్ మాల్స్, జ్యువెల్లర్స్

కస్టమర్లతో సందడి తలపిస్తున్న వస్త్ర నిలయాలు

అందరూ మెచ్చే ధరల్లో బట్టలపై డిస్కౌంట్ ధరలు

ట్రెండ్‌కు తగ్గ డ్రెస్సుల ఎంపిక

మారుతున్న ఫ్యాషన్‌కు అనుగుణంగా డ్రెస్సుల్లో ఛేంజ్

డిమాండ్ దృష్ట్యా శివార్లలో సైతం వెలుస్తున్న ప్రముఖ షాపింగ్ మాల్స్



# శ్రావణం.. ఆఫర్ల వర్షం!

సిటీబ్యూరో, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ) : శ్రావణం వచ్చిందంటే పర్వదినాలకు రంగం సిద్ధమవుతున్నట్టే. శ్రావణ మాసం మొదలు కావడంతో రాబోయే వరుస పండుగల కోసం మహిళామణులు ఇప్పటి నుంచే షాపింగ్‌కు సిద్ధమవుతున్నారు. అందుకే వారు మెచ్చేలా వస్త్ర దుకాణాలు ముస్తాబవుతున్నాయి. కేజీల లెక్కన చీరలు, ఒకటి కొంటే మరోకటి ఫ్రీ ఇలా అనేక ఆఫర్లతో మహిళలను షాపింగ్ మాల్స్ ఆకట్టుకుంటున్నాయి. శ్రావణంలో అన్నింటికన్నా ముఖ్యంగా మగువలను ఆకర్షించే బంపర్ ఆఫర్ ఏదైనా ఉంటే అది కేజీల్లో చీరలను విక్రయించడమే. కొన్ని షాపులు ఫ్యాన్సీ డ్రెస్సులపై 70 శాతం వరకు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. శ్రావణం రాయితీల్లో భాగంగా ఫ్యాంట్, షర్ట్‌లను కొన్ని మాల్స్ సగం ధరకే విక్రయిస్తున్నాయి. సికింద్రాబాద్, అమీర్‌పేట్, కోఠి, దిల్‌షుక్‌నగర్, అబిడ్స్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో వస్త్ర నిలయాలు కస్టమర్లతో కళకళలాడుతున్నాయి. సాధారణంగా నగరంలో ఏ రోజైనా షాపింగ్ మాల్స్ సందడి తలపిస్తుంటాయి. ముఖ్యంగా పండుగలు సమీపిస్తున్న వేళ మాల్స్ కిటకిటలాడుతున్నాయి.



## విభిన్న రకాల డిజైన్లు..!

ఫ్యాషన్ దుస్తుల ఎంపికలో చాలా మంది అమ్మాయిలు ప్రస్తుత ట్రెండ్‌ను అనుసరించడానికే మొగ్గు చూపుతున్నారు. మార్కెట్లోకి కొత్తకొత్త డిజైన్లు ఏమొచ్చినా వాటిపై లుక్కేస్తున్నారు. ముఖ్యంగా కాలేజీ అమ్మాయిలు తమ డ్రెస్సుల సెలక్షన్‌లో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నగరంలో ఫ్యాషన్ డిజైనర్లను సైతం సంప్రదిస్తూ ప్రత్యేక దుస్తులను తయారు చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. తమకు నప్పే దుస్తులను ఎంచుకోవడంలో ధరలకు వెనకాడటం లేదు. ప్రస్తుతం అమ్మాయిలు ఎక్కువగా వెస్టర్న్ స్కర్ట్స్, షార్ట్స్, లాంగ్‌డ్రెస్సెస్, ఫ్యాన్సీ డ్రెస్సెస్‌ను పార్టీలలో ధరించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. చాలా రకాల డిజైన్‌లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నప్పటికీ.. ఇంకా వెరైటీ కావాలనుకునే వారు ఫ్యాషన్ డిజైనర్లను సంప్రదిస్తే వారికి నచ్చిన విధంగా డిజైన్ చేసి ఇచ్చే సౌలభ్యం నగరంలో అందుబాటులో ఉందని నిపుణులు చెబుతున్నారు. కాగా ఈ కాలం అమ్మాయిలు, మహిళలు వేడుకను బట్టి డ్రెస్సులను ఎంపిక చేసుకుంటున్నారు. తద్వారా సంబంధిత దుస్తుల మాల్స్‌కు విపరీతంగా డిమాండ్ పెరుగుతున్నది. మరోవైపు చేనేత దుస్తులకు సైతం మార్కెట్లో ప్రత్యేక ఆదరణ ఉంది. ప్రత్యేక దుకాణాలు వాటి విక్రయానికి వెలిశాయి. హ్యాండ్లూమ్స్ పై విభిన్న రకాల స్టోన్స్ జత చేసి డిజైన్లను అద్దుతున్నారు.

## షాపింగ్ మాల్స్‌లో నగరం దూకుడు..!

షాపింగ్ మాల్స్‌తో నగర రూపురేఖలు మారిపోతున్నాయి. నగరవాసుల కొనుగోలు శక్తి పెరగడంతో వారు షాపింగ్, వినోదంపై అత్యధికంగా ఆసక్తి చూపిస్తున్నారు. వారి ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్స్ తమ కార్యాలయాలను నగరంలో ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే ఉన్న షాపింగ్ మాల్స్‌కు ధీటుగా ఒకే చోట వినోదం, షాపింగ్ ఉండేలా మాల్స్ వెలుస్తున్నాయి. కుటుంబ సమేతంగా అవసరమయ్యేవన్నీ అందుబాటులో ఉంచుతున్నాయి. చుట్టపక్కల రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను ఇవి అంతగా ప్రభావితం చేస్తున్నాయి. అందుకే మాల్స్ నిర్మాణంలో హైదరాబాద్ దూసుకుపోతుంది. ఐటీ కారిడార్‌లోనే ఇవి అత్యధికంగా వస్తున్నాయి. రిటైల్ స్పేస్‌లో వ్యవస్థీకృత మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. బ్రాండెడ్ దుకాణాల రాకతో వీటికి డిమాండ్ పెరిగిందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. వినోదం, షాపింగ్, ఆహారం వరకు అన్నీ ఒకే చోట సౌకర్యంగా ఉండటంతో సందర్శకులు ఉదయం నుంచి రాత్రి వరకు మాల్స్‌లోనే గడుపుతున్నారు. ఆదాయాలు పెరగడం, జీవనశైలిలో వచ్చిన మార్పులు కూడా వీటికి బాగా కలిసోస్తుంది. హైదరాబాద్ షాపింగ్ దుకాణాలు తమ బ్రాండ్లను నగరవాసులకు పరిచయం చేయడంలో పోటీపడుతున్నాయి. చాలా మంది ఇప్పుడు బ్రాండెడ్ దుస్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

# ఆభరణాలు.. తరగని ఆస్తులు!

జాతీయ, అంతర్జాతీయ ఆభరణాల ఎక్స్‌పోలకు కేరాఫ్‌గా హైదరాబాద్

నగరంలో జ్యువెల్లరీకి పెరుగుతున్న క్రేజ్

వెండి, గోల్డ్, డైమండ్ ఆభరణాలకు ప్రత్యేక ఆదరణ

సరికొత్త జ్యువెల్లరీని పరిచయం చేస్తున్న కంపెనీలు



సిటీబ్యూరో, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ) : అలంకరణలో ఆభరణాలది ప్రత్యేక స్థానం. సీజన్‌తో సంబంధం లేకుండా మగువల మనసును దోచే ఆభరణాలు అనేకం. చెవి పోగుల నుంచి వడ్డాణం వరకు ప్రతిది ఓ ప్రత్యేకత. ట్రెండ్‌కు తగ్గ జ్యువెల్లరీని పరిచయం చేయడానికి నగరంలో సరికొత్త జ్యువెల్లరీ దుకాణాలు తమ శాఖలను ఏర్పాటు చేస్తున్నాయి. ముఖ ఆకారాన్ని ఆధారం చేసుకుని.. వయస్సును దృష్టిలో ఉంచుకుని..వర్కింగ్‌ను బట్టి, డ్రెస్సును ఆధారంగా చేసుకుని.. ఇలా విభిన్న రకాలుగా జ్యువెల్లరీని మార్కెట్‌లోకి తీసుకొని రావడానికి కంపెనీలు పోటీ పడుతున్నాయి. వెండి, గోల్డ్, డైమండ్ తదితర ఆభరణాలన్నీ ప్రత్యేక క్రేజ్‌ను సొంతం చేసుకుంటున్నాయి. వీటిని కొనుగోలు చేయడానికి కస్టమర్లు సైతం అమితాసక్తి చూపిస్తున్నారు. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ వేగంగా జ్యువెల్లరీ రంగంలో అడుగులు వేస్తుంది. ఇప్పటికే ఆభరణాల ఎక్స్‌పోలకు హైదరాబాద్ వేదికగా నిలుస్తోంది. దేశ, విదేశీ గోల్డ్ అండ్ పెరల్స్ కంపెనీలన్నీ నగర వేదికగా తమ ఉత్పత్తులతో ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తున్నాయి. దేశంలో హైదరాబాద్ మార్కెట్ చాలా గొప్పగా ఉందని అంతర్జాతీయ జ్యువెల్లరీ రంగం నిపుణులు సైతం పేర్కొంటున్నారు. జెమ్స్ అండ్ జ్యువెల్లరీ రంగానికి అనువైన వాతావరణం, ప్రోత్సాహం అందించడానికి హైదరాబాద్ సరైనదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక్కడ తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి కంపెనీలు పోటీ పడుతున్నాయి.

## బంగారానిది ప్రత్యేక రోల్..!

ఆభరణాల్లో బంగారం క్రేజ్ వేరే లెవల్. చిన్న ముక్కుపుడకైనా బంగారమై ఉండాలని చాలా మంది మహిళలు ఆశపడుతుంటారు. రోజులెన్ని గడిచినా వన్నె తరగని లోహం బంగారం. దాని విలువ అదే స్థాయిలో ఉంటుంది. ధనికుల నుంచి పేద వారి వరకు బంగారం కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తుంటారు. బంగారం కొనడం ఒక సెంటిమెంట్‌గా భారతీయ సంస్కృతిలో ఉంది. మహిళలకు కనకంపై ఉండే ఆపేక్షను మాటల్లో వర్ణించలేం. ముఖ్యంగా అక్షయ తృతీయ, ధన త్రయోదశి రోజుల్లో.. పండుగలు, పెండ్లి, వ్రతాలు ఇతర శుభకార్యాలకు బంగారాన్ని కొనడం, ధరించడం ఆనవాయితీగా ఉంటుంది. ధనవంతుల నుంచి పేదల దాకా ఆయా సందర్భాల్లో ఎంతో కొంత బంగారం కొనుగోలు చేస్తుంటారు. పెండ్లి సందర్భాల్లో బంగారం ధర ఎంత అధికంగా ఉన్నా దాన్ని కొనుగోలు చేస్తుంటారు. నగరంలో బంగారు దుకాణాలన్నీ ప్రతి రోజు కస్టమర్లతో సందడిని తలపిస్తుంటాయి. వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని ఆభరణాల దుకాణాలు పోటాపోటీగా నాణ్యతతో కూడిన పసిడిని అందించడానికి సై అంటున్నాయి. నగరంలో బంగారు దుకాణాలన్నీ పండుగలతో సంబంధం లేకుండా సందడిగా ఉంటాయి. ఇటీవలి కాలంలో బంగారం ధర తగ్గడంతో చాలా మంది నగరవాసులు బంగారం కొనుగోలు చేసి తమకు ఇష్టమైన ఆభరణాలను తయారు చేయించుకుంటున్నారు.

## ట్రెండ్ గురూ..!

ప్రస్తుతం బోల్డ్, క్లాసిక్ రంగుల మిశ్రమంతో రూపొందించిన ఆభరణాలు, మీనాకారి విడివిడిగా రాళ్లతో తయారుచేసిన ఆభరణాల ట్రెండ్ నడుస్తోంది. వీటితో పాటు డైమండ్, రూబీ లాంటి రంగురాళ్లతో ఆభరణాలు తయారుచేసే క్లాసిక్ డైమండ్ జ్యువెల్లరీ కూడా బాగా ట్రెండ్‌లో ఉంది. రోజ్‌గోల్డ్ కూడా బాగా ప్రాచుర్యంలో ఉందని జ్యువెల్లరీ నిర్వాహకులు రాధిక తెలిపారు. ఇండియన్ స్కిన్‌టోన్‌పై బాగా కనిపించేలా రోజ్‌గోల్డ్ ఉంటుంది. ఇప్పుడు దీనిని మగువలు కొనడానికి అమితాసక్తి చూపిస్తున్నారు. బోల్డ్‌ఎలిగెంట్ చోకర్, ఇయర్ రింగ్స్ ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. ఎప్పుడైన సరే ధరించాలని అనువుగా ఉంటున్న వెరైటీలను ఎంపిక చేసుకుంటున్నారు. ఇక అన్ని రంగుల దుస్తులతో మ్యాచ్ అయ్యేలా ట్రాప్డ్, ప్రొటెక్టెడ్ జెమ్ స్టోన్‌లో రత్నాలు పొదిగిన జ్యువెల్లరీ మార్కెట్‌లో అందుబాటులో ఉందని నిర్వాహకులు చెప్పారు. ప్రస్తుతం ఫ్లూయిడ్ ఫార్మ్ దుస్తులు ఎక్కువగా ధరిస్తున్నారు. ఇలాంటి స్థితిలో మరింత అందంగా కనిపించడానికి ఫ్లూయిడ్ ఫార్మ్ ఆభరణాలను ఆశ్రయిస్తున్నారు.

## తక్కువ ధరలో సౌకర్యంగా..!!

ఆభరణాలను డిజైన్ చేసే సమయంలో మూడు విషయాలను దృష్టిలో ఉంచుకుంటారు. ఒకటి సౌందర్యపు విలువ, ధరించడంలో ఉన్న సౌకర్యం, మూడోది తక్కువ ధర. ప్రస్తుతం మహిళలు తక్కువ ధరలో అందమైన డిజైన్లను వెతుకుతున్నారు. అవి అన్ని అవసరాలకు తగ్గట్టుగా ఉండాలని భావిస్తున్నారు. బ్రైడల్ జ్యువెల్లరీలో మహిళలు అన్ని రకాల ఆభరణాలు అంటే పాపిడి బిళ్ల, ముక్కుపోగు, జూకాలు, నెక్లెస్, మీడియం నెక్లెస్, చెవి జూకాలు, చెవిపోగులు, దండె కడియాలు, చేతి వంకీలు, వడ్డాణం, గజ్జెలు, మెట్టెలు లాంటి వాటిపై మనసు పారేసుకుంటున్నారు. ఇక ఆఫీసుకు వెళ్లే మహిళల ఇష్టాలు సాధారణ మహిళలకు భిన్నంగా ఉంటాయి. వాళ్లు ఎక్కువగా చిన్న చెవిపోగులు, చిన్న జూకాలు, నార్మల్ క్లాసిక్ డ్రెస్‌తో పాటు ధరించడానికి ఇష్టపడుతారని ఐటీ ఉద్యోగి రవళి తెలిపారు. వేసుకునే డ్రెస్సులకు మ్యాచ్ అయ్యే ఆభరణాలను కొనుగోలు చేస్తామని చెప్పారు. ఆభరణాలు ట్రెండ్ కంటే కూడా ఎక్కువగా ముఖాన్ని బట్టి ధరిస్తారని నిపుణులు చెబుతున్నారు. ఓవెల్ ఫేస్‌లో ముఖం ఉన్న మహిళలకు మార్కిజ్ షేప్ చెవి ఆభరణాలు బాగుంటాయి. రౌండ్ షేప్ ఉన్న వాళ్లు జూకాలు ధరిస్తే బాగుంటాయి. స్క్వేర్ షేప్ ముఖం ఉన్న వాళ్లు జామితీయ ఆకారంలో ఉండే చెవి ఆభరణాలు ధరిస్తే బాగుంటుంది. టీనేజీ అమ్మాయిల్లో చిన్నచిన్న కలర్‌ఫుల్ డెలికేట్ ఆభరణాలు ధరించే ట్రెండ్ ఎక్కువగా నడుస్తోంది. ఇప్పుడు నోస్ పిన్, నోస్ క్లిప్స్‌లు బాగా ప్రచారంలో ఉన్నాయి. అవి వెస్టర్న్ డ్రెస్సులో బాగా నప్పుతాయి.

## కలర్‌ఫుల్ జ్యువెల్లరీకి యమ క్రేజ్..!

జ్యువెల్లరీ వినియోగం లేకుండా ఏ పెండ్లీ లేదు. ఎలాంటి వేడుకలైన మగువలు ఏదో ఒక జ్యువెల్లరీ ధరించాల్సిందే. అందులో ఇప్పుడు బాగా వినియోగంలో కలర్‌ఫుల్ జ్యువెల్లరీ ఉంది. మిడిల్ ఏజ్‌లో ట్రెడిషనల్, ఫైవ్ వర్క్ ఉన్న క్లాసిక్, ఫైన్ గోల్డ్ ఆభరణాలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. వీటితో పాటు జూకాలు, చెవిపోగులు, జాలీవర్క్, డైమండ్‌లుక్ ఎక్కువ ట్రెండ్‌లో ఉన్నాయి. 50 దాటిన మహిళలకు సింగి లైన్ నెక్లెస్, కుందన్ నెక్లెస్, ప్యూర్ డైమండ్ లేదా గోల్డ్ కంకణం లాంటివి బాగా ప్రచారంలో ఉన్నాయి. మార్కెట్లో విభిన్న రకాల జ్యువెల్లరీ అందుబాటులో ఉంది.




